మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  ఎడిటర్ : నంద కిషోర్  సంపుటి : 08  సంచిక : 115  శనివారం  11 - 10 - 2025  పేజీలు: 8  వెల: 4

## పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



3లో..

# అజాత శత్రువు

**- మార్కెట్ యార్డ్ ప్రగతి కాంక్షాపరుడు టిజివి కుటుంబానికి వీర విధేయుడు...**

- రైతన్నల శ్రేయస్సే లక్ష్యం అన్నదాతల సంక్షేమమే ధ్యేయం...
- బలవన్మరణాలు తగవంటోన్న రైతు పక్షపాతి
- మార్కెట్ యార్డ్ ప్రగతే తన జీవితాశయమంటోన్న..

రైతు బాంధవుడు

8 లో..





## భ్రమరాంభ గెస్ట్ హౌస్‌ను పరిశీలించిన జేసీ

మనగళం, శ్రీశైలం/నంద్యాల: ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 16న శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రానున్న నేపథ్యంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ భ్రమరాంభ గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లు, వసతులను సమీక్షించారు. పర్యటన సందర్భంగా ఆయన గెస్ట్ హౌస్‌లో ఉన్న వసతి సదుపాయాలు, గదుల శుభ్రత, ఆహార వసతులు, నిర్వాహణ విధానాలను పరిశీలించి సంబంధిత అధికారుల 2 లో..



మోదీతో మాట్లాడటానికి నెతన్యాహు

## భద్రతా సమావేశం నిలిపివేత

- గాజా యుద్ధ సమయంలో భారత్ తటస్థ దౌత్య సంకేతాలు
- మానవతా సహాయం, బంధీల విషయంలో చర్చలు జరిగిన సూచనలు
- భారత దౌత్య బలం పై అంతర్జాతీయ రాజకీయ వర్గాల దృష్టి

మన గళం, న్యూఢిల్లీ : మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న యుద్ధ ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అత్యవసరంగా నిర్వహిస్తున్న భద్రతా సమీక్ష సమావేశాన్ని మధ్యలోనే నిలిపివేసి భారత ప్రధాని నరేంద్ర మోదీతో నేరుగా ఫోన్‌లో మాట్లాడటం అంతర్జాతీయ వేదికపై గమనించదగిన పరిణామంగా మారింది. గాజా ప్రాంతంలో హమాస్ దాడులు, ప్రతిగా ఇజ్రాయెల్ 2 లో..

## ప్రధాని మోడీ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

- మూడు లక్షల మంది సభకు హాజరు
- పదివేల బస్సుల కు పార్కింగ్ సౌకర్యం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి



మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ ఈ నెల 16 ఉంటుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మీడియాతో మాట్లాడారు. ఈనెల 16న దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముందుగా ఓర్వకల్ ఏర్పోర్ట్ చేరుకుంటారని, అక్కడి నుండి శ్రీశైలం వెళ్లి స్వామి,అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు. అనంతరం నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగ మయూరి వెంచర్ లో ఏర్పాటుచేసిన" సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2 లో..

## సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ

**- లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి**



మనగళం, నంద్యాల : అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ కార్యాల యంలో ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామా నికి చెందిన గజ్జల నాగశేషులుకు మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 8.50 లక్షల చెక్కును ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లా డుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనస్సున్న మారాజు అని, పేద రోగులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేస్తూ అండగా ఉంటున్నారని కొనియాడారు. భాధితులు సీఎం చంద్రబాబుకు అండగా నిలువాలని, కూటమి సర్కార్ ను దీవించాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు.

## దగ్గు మందు మరణాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది



- ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రశ్నలు

మన గళం, న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దగ్గు సిరప్ కారణంగా చిన్నారులు మృతి చెందారని ఆరోపిస్తూ సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారించేందుకు నిరాకరించింది. ప్రముఖ న్యాయవాది విశాల్ తివారీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. కేసును ప్రారంభంగా పరిశీలించిన ధర్మాసనం నోటీసులు జారీ 2 లో..

## ముమ్మరంగా ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లు



మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్రమోడీ కర్నూలు జిల్లా పర్యటన ఏర్పాట్లు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ప్రధాని ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ వీర పాండియన్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ముందుగా స్టేజీ వద్ద జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్యాలరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జరుగుతున్న పనుల వివరాలు వెల్లడించారు. హెలిప్యాడ్, వీవీఐపీ రోడ్లు, వీవీఐపీ పార్కింగ్ పనులు, పబ్లిక్ వచ్చేందుకు రోడ్లు, వాహనాల పార్కింగ్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువు కన్నా ముందే పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విధులు కేటాయించిన ఐఏఎస్ అధికారులతో మంత్రి మాట్లాడారు.



## గుంటూరులో బీసీ హాస్టల్ కలకలం

మన గళం, గుంటూరు జిల్లా అన్నపర్రులోని బీసీ హాస్టల్‌లో ఒక్కసారిగా విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో కలకలం రేగింది. మొత్తం 106 మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్‌లో గత రెండు రోజులుగా పలువురు విద్యార్థులు వాంతులు, జ్వరంతో ఇబ్బంది 2 లో..

## జైళ్లలోని ఖైదీలకు ఓటు హక్కుపై విచారణ



- ఖైదీల ఓటు హక్కుపై సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం
- దాదాపు 4.5 లక్షల మంది ఓటు హక్కు కోల్పోతున్నారని పిటిషన్
- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం

మన గళం డెస్క్ : దేశవ్యాప్తంగా జైళ్లలో ఉన్న విచారణ ఖైదీలు, శిక్ష ఖరారు కాని సుమారు 4.5 లక్షల మందికి ఓటు హక్కును నిరాకరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ప్రముఖ 2 లో..

## ఎద్దులతో విద్యుత్.. నెల్లూరులో చంద్రబాబుకు ఆశ్చర్యం

- ఒంగోలు జాతి పరిరక్షణపై పిలుపు
- వ్యవసాయానికి బయో ఎనర్జీ దిశలో కొత్త మార్గం
- భవిష్యత్తు లక్ష్యాల వైపు రాష్ట్ర దిశా నిర్దేశం



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలో పర్యటించిన సందర్భంగా సాంకేతిక అభివృద్ధి దిశగా సాగుతున్న కాలంలోనే సంప్రదాయ బలం, పూర్వపు జీవన విధానాలు తీసుకువచ్చే అవకాశాలను ప్రస్తావిస్తూ ఒక వినూత్న ప్రాజెక్ట్‌ను ప్రశంసించారు. ఎద్దులతో విద్యుత్ ఉత్పత్తి చేసే నమూనా తనను ఆశ్చర్యపరిచిందని, బొగ్గు, నీరు, గాలి, సౌర శక్తుల మాదిరిగానే పశుశక్తిని విద్యుత్ రూపంలో వినియోగించడం కొత్త దారిని చూపుతుందని పేర్కొన్నారు.

దేశంలో ఇదే మొదటిసారి ఎద్దుల శక్తితో ఐదు యూనిట్ల విద్యుత్తును సమర్థవంతంగా ఉత్పత్తి చేసిన ఈ ప్రాజెక్ట్ భవిష్యత్తుకు మార్గసూచిగా నిలుస్తుందని తెలిపారు విశ్వసముద్ర గ్రూప్ ఆధ్వర్యంలో ప్రారంభించిన 'నందగోకులం - సేవ్ ది బుల్' కార్యక్రమం ద్వారా ఒంగోలు జాతి గిత్తల పరిరక్షణకు నూతన దారులు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను ప్రపంచానికి తెలియజేసిన ఒంగోలు జాతి నేడు కనుమరుగైపోతుండగా, అదే జాతిని బ్రెజిల్ దేశం పరిరక్షించి ప్రపంచ మార్కెట్లో 2 లో..

## మోదీతో మాట్లాడటానికి నెతన్యాహు భద్రతా సమావేశం నిలిపివేత

సైన్యం చేపడుతున్న వైమానిక హెచ్చరిక చర్యలు వరుసగా కొనసాగుతున్న సమయంలో జరిగిన ఈ సంభాషణకు ప్రాధాన్యం పెరిగింది. ప్రపంచం మొత్తం ఉద్రిక్తతను ఆపడానికి దౌత్యరంగ ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ యుద్ధ వాతావరణం మార్పు చెందకపోవడంతో భారత్ స్పందనను తెలుసుకోవాలనే ఉద్దేశంతో నెతన్యాహు మోదీని సంప్రదించినట్లు సమాచారం. ఇంతకుముందే మోదీ హింస ఏ రూపంలోనైనా ఆగాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకూడదని, మానవతా దృష్టిలో పరిష్కారం కావాలని భారత్ ప్రకటించిన తటస్థ వైఖరి ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తోంది. భారతదేశం యుద్ధాన్ని మౌనంగా గమనించడమే కాక, అవసరమైతే శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం చేసే సామర్థ్యం ఉన్న దేశంగా భావించబడుతున్న నేపథ్యంలో నెతన్యాహు మోదీతో నేరుగా సంప్రదించడం భారత దౌత్య బలం ఎటువంటి స్థాయికి చేరుకుందనే ప్రశ్నను ప్రపంచానికి ముందుంచింది. ఫోన్ సంభాషణలో మానవతా సహాయం, బంధీల విడుదల, గాజాలో చిక్కుకుపోయిన పౌరుల రక్షణ వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయని ఇజ్రాయెల్ మీడియా వెల్లడించింది. యుద్ధం కఠిన మలుపు తీసుకుంటుండగా భారత్ స్పందనను సానుకూలంగా చూడాలని ఇజ్రాయెల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్ పరిస్థితిని సమతుల్యతతో చూడాలనే తన విధానాన్ని కొనసాగిస్తూనే, దౌత్యరంగ సంకేతాల ద్వారా శాంతి యత్నాలకు దారితీసే సందేశాలను ఇస్తోంది. ఇలాంటి సమయంలో నెతన్యాహు అత్యవసర భద్రతా సమావేశాన్ని బ్రేక్ చేసి మోదీతో మాట్లాడటం కేవలం సౌజన్యం కాదని, యుద్ధ వాతావరణంలో భారత్ మాటకున్న అంతర్జాతీయ ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## భ్రమరాంభ గెస్ట్ హౌస్‌ను పరిశీలించిన జేసీ

నుంచి వివరాలు తెలుసుకున్నారు. గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు వంటి అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి రి శ్రీశైలం పర్యటన సందర్భంగా గెస్ట్ హౌస్‌లో వసతులను మెరుగుపరచడం అత్యంత ప్రాధాన్యంగా పరిగణి స్తున్నామన్నారు. సౌకర్యవంతమైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గెస్ట్ హౌస్‌లో ఉన్న సదుపాయాలను ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా మరమ్మతులు, అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. విశిష్ట అతిథులకు సౌకర్యవంతంగా ఉండేలా విద్యుత్, నీటి సరఫరా, భద్రతా పర్యవేక్షణ వ్యవస్థలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, దేవస్థాన అధికారులు జేసీ వెంట ఉన్నారు.

## ప్రధాని మోడీ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

" బహిరంగ సభకు హాజరవుతారని చెప్పారు. ఈ బహిరంగ సభ 40 ఎకరాలలో ఏర్పాటు చేశామని, దాదాపు మూడు లక్షల మంది సమావేశంలో పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. దాదాపు 10వేల బస్సులు నిలుపుకునే విధంగా 12 పార్కింగ్ పాయింట్స్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని పార్కింగ్ పాయింట్లు జాతీయ రహదారి కి అనుసంధానం చేసే విధంగా అంతర్గత రహదారులు కూడా నిర్మించడం శనివారం సాయంత్రానికి పూర్తవుతాయని తెలిపారు. పబ్లిక్ మీటింగ్‌కు వచ్చిన ప్రజలందరికీ తాగునీరు, మజ్జిగ, భోజనం తదితర అవసరమైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు.

## దగ్గు మందు మరణాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది



చేయాలని భావించినప్పటికీ, అనంతర విచారణలో ఈ మేరకు ముందుకు వెళ్లకూడదని నిర్ణయించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యూస్ పేపర్లలో వచ్చిన ఆధారాలతోనే కోర్టు ఆశ్రయించడం సరికాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. ఆయన ఏ ప్రత్యేక రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం లేదని తెలిపినా, తమిళనాడు, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే ఈ అంశంపై కఠిన చర్యలు తీసుకున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. డ్రగ్స్ చట్టాలను అమలు చేయడానికి రాష్ట్రాల్లో ప్రత్యేక వ్యవస్థలు ఉన్నాయని, వాటిని పక్కన పెట్టి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. పిటిషన్ దాఖలు చేసిన విశాల్ తివారీ ఇప్పటి వరకు ఎన్ని ప్రజాప్రయోజన వ్యాజ్యాలు చేసినట్లు ధర్మాసనం ప్రశ్నించగా, 8 నుంచి 10 మేర దాఖలు చేసినట్లు ఆయన సమాధానం ఇచ్చారు. దీనిపై ఆలోచనీయ వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం ఈసారి దర్యాప్తు ఆదేశాలు ఇవ్వకుండా పిటిషన్‌ను తోసిపుచ్చింది. నాసిరకం మందులు మార్కెట్‌లోకి రాకుండా ముందు నుంచే నాణ్యతా తనిఖీ వ్యవస్థలను బలపరచాలని, టాక్సికాలజీ పరీక్షలు తప్పనిసరి చేయాలని తన వ్యాజ్యంలో పిటిషనర్ విజ్ఞప్తి చేసినా, కోర్టు రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు సరిపోతాయని భావించింది.

## జైళ్లలోని ఖైదీలకు ఓటు హక్కుపై సుప్రీంకోర్టులో విచారణ



న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ద్వారా దాఖలైన ఈ పిటిషన్‌లో, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 62(5) కింద ఖైదీలపై విధిస్తున్న నిషేధం రాజ్యాంగ హామీలకు, అంతర్జాతీయ ఒప్పందాలకు విరుద్ధంగా ఉందని వాదించారు. ఓటర్ల జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కు ఉంటుందని, కేవలం నివాసం లేకపోవడం, మతిస్థిమితం కోల్పోవడం లేదా ఎన్నికల సంబంధిత నేరాలకు పాల్పడటం వంటి కారణాలతో మాత్రమే ఆ హక్కును నిరాకరించాలని పిటిషనర్లు పేర్కొన్నారు. వాస్తవానికి శాసనసభ్యులకు వర్తించాల్సిన ఈ నిబంధనను, జైల్లో ఉన్న సాధారణ ఓటర్లందరికీ వర్తింపజేయడం చట్టవిరుద్ధమని వాదించారు.

ఈ నిషేధం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతుందని, ఇది ఏకపక్షంగా ఉందని పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. "భారత్‌లోని జైళ్లలో 75 శాతానికి పైగా విచారణ ఖైదీలే ఉన్నారు. వారిలో 80 నుంచి 90 శాతం మంది చివరికి నిర్దోషులుగా విడుదలవుతున్నారు. అయినా దశాబ్దాల పాటు వారు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు" అని తెలిపారు. "జైల్లో ఉంటూ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుమతిస్తున్నప్పుడు, నేరం ఇంకా రుజువుకాని సాధారణ పౌరులకు ఓటు వేసే హక్కును ఎలా నిరాకరిస్తారు?" అని పిటిషనర్లు ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 1,350 జైళ్లలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదా పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఖైదీల ఓటు హక్కును సులభంగా కల్పించవచ్చని సూచించారు. అనేక దేశాల్లో ఇలాంటి సంపూర్ణ నిషేధం లేదని, పాకిస్థాన్‌లో సైతం విచారణ ఖైదీలకు ఓటు హక్కు ఉందని పిటిషన్‌లో ఉదహరించారు.

## ఎద్దులతో విద్యుత్.. నెల్లూరులో చంద్రబాబుకు ఆశ్చర్యం




స్థానం సంపాదించడం మనకు ఆలోచన కలిగించే విషయం అని వ్యాఖ్యానించారు. ఒంగోలు గోవుల ఆర్థిక, సాంస్కృతిక విలువలను మళ్లీ చైతన్యం చేయాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టంగా గుర్తు చేశారు.

ఈ పర్యటనలో భాగంగా నందగోకులం లైఫ్ స్కూల్‌ను ప్రారంభించిన చంద్రబాబు, సామాన్య కుటుంబాల పిల్లలు కూడా ఉన్నతమైన విద్యను పొందాలి అనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ మోడల్ సమాజ మార్పుకు దారి తీస్తుందని పేర్కొన్నారు. డబ్బు దానం చేయడం కన్నా భవిష్యత్ తరాలకు విలువలను నింపే ప్రయత్నాలు మరింత గొప్పవని, సమాజం ఇచ్చిన అవకాశాలను తిరిగి సమాజానికే అందించే ధర్మం ప్రతి విజయవంతుడిలో ఉండాలని పిలుపునిచ్చారు. భావితరాలకు మంచి పౌరసత్వానికి అర్థం చెప్పే ఈ విద్యాసంస్థ ఒక ప్రత్యామ్నాయ వైఖరిని సమాజంలో నెలకొల్పుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తరువాత విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసి, వ్యవసాయాన్ని శుద్ధమైన ఇంధన ఉత్పత్తి రంగంతో అనుసంధానం చేయడం ద్వారా రైతుల ఆదాయానికి నూతన మార్గాలు కనిపిస్తాయని అన్నారు. దాదాపు పదిహేనువేల టన్నుల ధాన్యం నూకలను వినియోగించి ఇథనాల్ తయారు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టించిన ఆంధ్రప్రదేశ్, రాబోయే ఏళ్లలో జాతీయ స్థాయి పరిశ్రమల కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్ 2047 నాటికి ప్రపంచంలో అగ్రరాష్ట్రంగా ఎదగాలంటే, ప్రతి రాష్ట్రం తన మౌలిక రంగాలను బలోపేతం చేసుకోవాలని ఆయన అన్నారు. ఆ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంటుందని, విశాఖలో రూ. 87 వేల కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం నెలకొనడం ఆ దిశగా కీలక అడుగు అని తెలిపారు. పేదరిక నిర్మూలన నుంచి సాంకేతిక విప్లవం వరకు, ప్రతి అడుగులో ప్రజల భాగస్వామ్యం అవసరమనేది చంద్రబాబు సందేశంగా మారింది.

## గుంటూరులో బీసీ హాస్టల్ కలకలం

పడుతున్నారు. ఈ ఉదయం పరిస్థితి మరింత విషమించడంతో 47 మంది విద్యార్థులను అత్యవసరంగా స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మరికొందరు ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించబడ్డారు. విద్యార్థుల్లో ఐదుగురు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు షిఫ్ట్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను అధికారులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెంటనే స్పందించారు. విద్యార్థులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిమిషానికోసారి మానిటర్ చేయాలని కలెక్టరేట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌లో అందిస్తున్న తాగునీరు, ఆహార నాణ్యతపై అనుమానాల నేపథ్యంలో ఆ సాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. స్థలంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ హేనా ప్రియ, డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ చంద్రశేఖర్ వంటి అధికారులు క్యాంప్ నిర్వహిస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. విద్యార్థుల స్థితిగతులన్నీ ప్రత్యక్షంగా మంత్రి సవితకు రిపోర్ట్ చేయాలని సూచించారు. స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతుంది. హాస్టల్‌లో ఆహార నాణ్యత, తాగునీటి సరఫరా, పరిశుభ్రతపై ప్రశ్నలు ఉత్థపిస్తున్నాయి. తల్లిదండ్రులు హాస్టల్ వసతి సదుపాయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం జరిగిందా? లేక మరో అంతర్గత కారణం ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విభాగాల సంయుక్త దర్యాప్తుతో నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో పేర్ని నాని హంగామా

మన గళం డెస్క్ : కృష్ణా జిల్లా మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ ఈ రోజు రాజకీయ వేడి చవిచూసింది. మాజీ మంత్రి, వైసీపీ శ్రేణులకు ప్రభావశీల నేతగా పేరుపొందిన పేర్నినాని పోలీసులు ఇచ్చిన 41ఎ నోటీసులపై నేరుగా స్టేషన్‌కు దూసుకెళ్లి హంగామా సృష్టించారు. ఇటీవల మచిలీపట్నంలోని మెడికల్ కాలేజ్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో అనుమతి లేకుండా నిరసన చేపట్టిన కేసులో పేర్ని నాని సహా 400 మందికి 41ఎ నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న పార్టీ వాట్సాప్ గ్రూప్‌లో "పోలీసుల నోటీసుకు స్పందించవద్దు" అంటూ మెసేజ్ పంపడం కొత్త మలుపు తిప్పింది. విచారణలో భాగంగా సుబ్బన్నను పోలీస్ స్టేషన్‌కు పిలిపించగా ఈ విషయం తెలుస్తూనే పేర్ని నాని కార్యకర్తల బృందంతో నేరుగా స్టేషన్‌లోకి దూసుకెళ్లారు

అక్కడే ఆర్ పేట సీఐతో ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. పోలీసుల వ్యవహారశైలిపై నాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "చట్టం పేరుతో ప్రజలను కాదు, ప్రభుత్వాన్ని సేవ చేస్తున్నారేమో చూసుకోండి" అంటూ నిలదీశారు. అధికార పార్టీ ఎదుట పోలీసులు నీలిపట్టాలు అయ్యారు అంటూ ఆరోపణలు గుప్పించారు. స్టేషన్‌లో ఉన్న కానిస్టేబుళ్లను ఉద్దేశించి "మీరు కూడా ఒత్తిడికి గురవుతారని నాకు తెలుసు" అంటూ సానుభూతి కోణం చూపడం గమనార్హం. అదే సమయంలో మేకల సుబ్బన్న అరెస్ట్‌ను 'అక్రమం'గా కొట్టిపారేసిన పేర్ని నాని%ా% "వైసీపీ కార్యకర్తలపై కేసులు పెడితే కోర్టుల్లోనే సమాధానం చెబుతాం, పోలీస్ స్టేషన్‌లలో కాదు" అంటూ హెచ్చరించారు. స్టేషన్‌లో పరిస్థితి వేడెక్కిపోవడంతో పోలీసులు చివరకు పేర్ని నానిని అక్కడి నుండి వెళ్లిపోవాలని అభ్యర్థించారు.



ఈ ఘటనతో స్థానిక రాజకీయాలు మరోసారి ఉత్కంఠభరిత మూడ్‌లోకి వెళ్లాయి. వైసీపీ వర్గాల్లో ఆగ్రహం, పోలీసులు మాత్రం చట్టపరమైన చర్యలే తీసుకున్నామని వివరణ ఈ రెండు సమాధానాల మధ్య మచిలీపట్నం రాజకీయంగా ఇంకో కొత్త రౌండ్ ప్రారంభమైనట్లే.

## శ్రీవారి అన్నప్రసాదంపై యువతి రీల్స్..

మన గళం డెస్క్ : తిరుమల శ్రీవారికి సంబంధించిన విశిష్టతను చూపిస్తూ ఒక యువతి సోషల్ మీడియాలో పంచుకున్న రీల్ అనుకోని మలుపు తీసుకుంది. భక్తి కోణంలో తీసిన ఆ వీడియోను ఇతర సందర్భంలోకి లాగుతూ, టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఒక వ్యక్తి ఫేస్‌బుక్‌లో వక్రీకరించిన పోస్ట్ పెట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రఫీ అనే వ్యక్తి టీటీడీ చైర్మన్, నిర్వాహకులపై అపవాదులు మోస్తూ వీడియోను రీ–షేర్ చేయడంతో టీటీడీ విజిలెన్స్ విభాగం అప్రమత్తమైంది. తిరుమల 1టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈవ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వైరల్ అవుతున్న వీడియోలో వైఎస్ఆర్‌సీపీ నేతల పేర్లు తీసుకుంటూ వ్యాఖ్యానాలు చేయడం గమనించిన పోలీసులు, ఇది ఉద్దేశపూర్వకంగా టీటీడీ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నమని ప్రాథమిక అభిప్రాయం వ్యక్తం చేశారు. తిరుమల పవిత్రతను కించపరిచేలా సోషల్ మీడియా వేదికగా వదిలే ప్రతి అపవాదపై కఠినంగా స్పందించాలని టీటీడీ గడచిన బోర్డు సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియాలో తిరుమలపై వచ్చే ప్రతి పోస్టుపై నిఘా పెట్టాలని టీటీడీ విజిలెన్స్ వింగ్ ఇప్పటికే పోలీసులకు సూచించింది.

శనివారం
11 - 10 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం 46, 50 సచివాలయల దగ్గర ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కే జగన్నాథం మాట్లాడారు. ఎన్నికల్లో హామీలో భాగంగా ప్రతి పేదవాడికి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి సర్కార్ ఇంతవరకు నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గత ప్రభుత్వం కర్నూల్ నగరంలోని జగన్నాథ గట్టునందలి 8400 ఇందిరమ్మ గృహాలను గాలికి వదిలేయడం జరిగిందన్నారు. అదే జగన్నాథ్ గట్టు నందలి పదివేలకుపైగా టిడ్కో గృహాలను ఆపివేయడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం నగరానికి దాదాపుగా 15 కిలోమీటర్ల దూరంలో జగనన్న కాలనీ స్థలాలు ఇవ్వడం జరిగిందని, మరి వాటి గతి ఏంటని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాస రావు మారుతి నగర్ అంబేద్కర్ నగర్ సోమిశెట్టి నగర్ రమ్య నగర్ వాసు నగర్ శాఖల కార్యదర్శులు మాలన్ బి. సులోచనమ్మ.వెంకటేశ్వరమ్మ. రాజేష్. శేషమ్మ. ఏపీ రైతు సంఘం నాయకుల్ బి రాముడు,శ్రీను,శివ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్ లో సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో అదాని స్మార్ట్ మీటరు వద్దు... పాత కరెంటు మీటరే ముద్దు అని శ్రీరామ్ నగర్ లో నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. మా ఇంటికి అదానిస్మార్ట్ మీటర్ వద్దు కరెంట్ చార్జీలు తగ్గించాలి అనే డిమాండ్ ఉన్న స్టిక్కర్లు ఇంటింటికి అతికించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం వార్డు నాయకుడు ఆర్ శేషం రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ నరసింహులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కరెంటు చార్జీల పెరుగుదల అదాని మీటర్ల పై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. కరెంట్ ఛార్జీలు రెండింతలు పెరిగిందని, పేదలపై భారం మోపడం సమంజసం కాదని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు బిగించము కరెంటు చార్జీలు తగ్గిస్తామని ప్రకటన చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తునపోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఎస్ అజ్మత్, ఎస్ నాగరాజు, పి బాబురావు, వై జాన్సన్, జి వెంకటేశ్వర్లు, రామ్, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : అనంతపురంలో ఈనెల 13 14 15 తేదీలలో నిర్వహించే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర16 వ మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వివిధ ప్రాంతాలలో మహిళా సంఘం జెండా ఆవిష్కరణలు చేశారు. నేతాజీ హౌసింగ్ కాలనీలో సి రేవతి అధ్యక్షతన కే పద్మావతి జండా ఆవిష్కరించారు. ఇందిరా గాంధీ నగర్ లో కుమారి అధ్యక్షతన పి నిర్మల జెండా ఆవిష్కరించారు. వికర్ సెక్షన్ కాలనీ సెంటర్ ముందు ఉన్న ఆఫీసులో శ్యామల అధ్యక్షతన వి లతా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన జెండా ఆవిష్కరణల సభలలో మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి నిర్మల, కే శ్యామల,వి లత లు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన అంశాలపై మహాసభలో చర్చిస్తామన్నారు. రాబోవు మూడు సంవత్సరాలలో మహిళల సమస్యల పరిష్కారం కొరకు తీసుకోవాల్సిన తీర్మానాలపై చర్చిస్తారన్నారు. మహాసభలలో మహిళల ఐక్యత, సమస్యల పరిష్కారం కొరకు అనంతపురంలో జరిగే మహాసభలు నాంధి పలుకుతాయని, ఈ రాష్ట్ర మహాసభలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని వారు కోరారు.

## భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోవాలి







– సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి

మనగళం, కర్నూలు సిటీ : ప్రతిఒక్కరూ తమ ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోవాలని, అప్పుడే మానసికంగా దృఢంగా ఉంటారని డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సేకరెట్రి, సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కర్నూల్ మెడికల్ కాలేజ్ సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో విభాగాధిపతి డా.నాగేశ్వర రావ్ అధ్యక్షణ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం బాగున్నప్పుడే ఆరోగ్యవంతులు అంటారన్నారు. వ్యక్తులు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు స్నేహితులు దగ్గరి బంధువులు గుర్తించి వారిని కలుపుకొని వెళ్తే ఆ సమస్య లోంచి బయట పడతారని తెలిపారు. పౌరులకు ఎవరికైనా ఇబ్బందులు ఎదురైనపుడు, లీగల్ సహాయం కోరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ని సంప్రదించాలని కోరారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ మాట్లాడుతూ విపత్తులు ఆపత్కాల పరిస్థితులలో మానసిక ఆరోగ్య సేవలో అందుబాటు అన్నది ఈ ఏడాది థీమ్ గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఎవరికైనా మానసికంగా అపత్కర పరిస్థితి ఏర్పడితే సేవల కోసం టేలీ మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 నంబర్ ని సంప్రదించాలని సూచించారు. కాలేజీ విద్యార్థులు తమ విద్యాభ్యాసం, ఇంకేదైనా పరిస్థితుల వలన ఒత్తిడికి గురవుతే వెంటనే మెంటార్ లను సంప్రదించాలని, తప్పకుండా తగిన సలహా సూచనలు ఇచ్చి సహాయపడతారని తెలిపారు. సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులతోపాటు సమాజంలో ఎవరికైనా మానసిక ఆరోగ్య సమస్యలకు తమ విభాగం నుంచి 24/7 సేవలందించడానికి సిద్ధంగా ఉన్నామని, పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం మెడికల్ అండ్ నర్సింగ్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు అందరినీ ఆలోచింపజేసేలా ఒత్తిడి సమయాల్లో ఎలా వ్యవహరించాలి అని నాటిక ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ విభాగ్యపతి డాక్టర్ శ్రీనివాసులు డి.ఎల్. ఎస్.ఏ సభ్యులు డా.రాయపాటి శ్రీనివాస్ సైకియాట్రీ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.గంగాధర్, డా.యతిరాజ్ ఎస్.ఆర్ లు డా.ఉమైద్ సిరాజ్, డా.జయశ్రీ, పీజీలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మానసిక ఆరోగ్య వార్డును సందర్శించిన జడ్జి



మనగళం, కర్నూలు సిటీ : మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం కర్నూలు లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని మానసిక ఆరోగ్య వార్డు ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి సందర్శించారు. మానసిక వికలాంగులకు ఆపిల్ పండ్లను జడ్జి పంచిపెట్టారు. అక్కడ ఉన్న మానసిక వికలాంగులను చూసుకునే తల్లితండ్రులకు, ఇతర పరిచారకులతో జడ్జి మాట్లాడారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల ఆరోగ్య సంరక్షణ హక్కు, ఆస్తి హక్కు, వైద్య చికిత్స అందించడం తదితర విషయాలను వివరించారు. మానసిక వికలాంగులకు కూడా సమాజంలో మిగతా వారి లాగానే జీవించే హక్కు ఉందన్నారు. మానసిక వికలాంగుల హక్కులకు భంగం కలిగితే చర్యలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. మానసిక వికలాంగుల కు ఏవిధమైన న్యాయ సహాయం కావాలన్న కర్నూలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అదేవిధంగా 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. నాల్సా (ఎన్ఏఎల్ఎస్ఏ) పథకం, 2024 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మానసిక ఆరోగ్య వార్డ్ హెడ్ అఫ్ డిపార్ట్మెంట్ డాక్టర్ నాగేశ్వరావు, సైకియాట్రిస్ట్ డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ యతిరాజు, లీగల్ సర్వీసెస్ యూనిట్ నెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, వైద్య అధికారులు, మానసిక వికలాంగుల తల్లితండ్రులు, ఇతర పరిచారకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి



– వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మనగళం, కర్నూలు సిటీ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ లో వైసీపీ నాయకులతో పెద్దిరెడ్డి సమావేశమయ్యారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బి వై రామయ్య, ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గం ఇన్చార్జిలతో వివిధ అంశాలపై పెద్దిరెడ్డి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం కాకుండా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతి కార్యకర్త సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని, ఆ దిశగా గ్రామస్థాయి కమిటీలుగా ఏర్పడి ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుందని, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. టీడీపీ నేతలే కల్తీ మద్యం తయారీకి పాల్పడి... వైసీపీ నేతలపై నిందలు మోపేందుకు కుట్రలు జరుతున్నాయని, వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కల్తీ మద్యంపై మహిళలను చైతన్య పరిచి రానున్న రోజుల్లో ఉద్యమించాలన్నారు. కల్తీ మద్యంపై సీబీఐ ఎంక్వయిరీ నిర్వహించేవిధంగా ఉద్యమాలు చేపట్టాలని పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్ ను వైసీపీ నేతలతో కలిసి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు.

## శ్రీ స్వామి అమ్మవార్లకుఊయలసేవ



శ్రీశైలం అక్టోబర్ 10 మనగళం : లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం శుక్రవారం సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది.ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## డిప్లమా కోర్సుల మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి



మనగళం, కర్నూలు సిటీ : అలైడ్ హెల్త్ సైన్సెస్ ( పారా మెడికల్ )కు సంబంధించిన 10 డిప్లమా కోర్సులకు మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తిచేయడం జరిగిందని ఏడీఎంఇ అండ్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. కె. చిట్టి నరసమ్మ శుక్రవారం తెలిపారు. మెరిట్ కం రోస్టర్ ప్రకారం సీట్లు భర్తీ చేయడం జరిగిందని, 18వ తేదీ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు వెబ్ సైట్ ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, పథాలజీ హెచ్ ఓ డి డాక్టర్ బాలేశ్వరి, ఏ.డి .మల్లేశ్వరి, ఆఫీస్ సూపరిండెంట్ హరి శంకర్ రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ హరి ప్రసాద్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభిమాని మృతికి ఎంపీ బైరెడ్డి శబరి నివాళులు

మనగళం, ఓర్వకల్లు : నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి వీరభిమాని, టీడీపీ ముఖ్య కార్యకర్త ఎం.మురళీధర్ రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీ బైరెడ్డి శబరి ఉయ్యాలవాడకు వెళ్లి మురళీధర్ రెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సంతాపం తెలిపి, సానుభూతిని తెలియజేశారు.


# విభజన హామీలను అమలు చేయాలి

- నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్



మనగళం, డోన్ : రాష్ట్ర విభజన హామీలను ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ నెల 16న ప్రధాని మోడీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో శుక్రవారం డోన్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యప్రతాప్ మాట్లాడారు. ప్రధాని మోడీ గతంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఇప్పటికైనా అమలయ్యేలా కూటమి పెద్దలు మోడీపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్నబీజేపీ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తిరుపతి సాక్షిగా ఇచ్చిన హామీ విస్మరించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. వెనకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంలోనూ బిజెపి ప్రభుత్వం విఫలమైందని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, చేస్తానని చెప్పి హామీని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యలో పెను మార్పులు అంటూ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొని వచ్చిందని, విద్య అభివృద్ధి కన్నా విద్య నాశనం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రధాని పర్యటనకు ముందే బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తో ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి పెద్దలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పీఎం పర్యటనను అడ్డుకుంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, అక్రమ్, ధనుష్, జయరాజ్, వెంకీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



శ్రీశైలం అక్టోబర్ 10 మనగళం : లోకకల్యాణం కోసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం శుక్రవారం ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేషపూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళు ్ళ మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# ప్రధాని మోడీ మహాసభను విజయవంతం చేద్దాం



మనగళం, కోడుమూరు : ప్రధాని నరేంద్రమోడీ కర్నూలులో ఈ నెల 16న పర్యటించనున్న నేపథ్యంలో నిర్వహించే మహాసభను ఐకమత్యంగా విజయవంతం చేద్దామని కోడమూరు నియోజకవర్గ బీజేపీ నేత వేల్పుల గోపాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండల బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ ఈ నెల 16న ఉదయం మొట్ట మొదటిసారిగా శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారన్నారు. సాయంత్రం కర్నూలు నన్నూరు టోల్ ప్లాజ దగ్గర జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొని అభివృద్ధి ఆర్థిక స్థిరత్వం ప్రజా సంక్షేమంపై రాష్ట్ర ప్రజలకు సందేశం ఇస్తారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు తరలివచ్చేలా కూటమి శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యమంలో కోడుమూరు రూరల్ మండల అధ్యక్షులు బెస్త ఈరన్న, రాఘవఆచారి, శివ, మదిలేటి, కృష్ణ, రఘునాథ్ సింగ్, విశ్వనాథరెడ్డి, పవన్ కుమార్, హర్షవర్ధన్ నాయుడు, మహేష్, యల్లప్ప, వెంకటేశ్వర్లు, మహేంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోని 100మంది కుబేరుల్లో అంబానీదే అగ్రస్థానం

మనగళం, న్యూఢిల్లీ: దేశంలో అత్యంత ధనవంతులైన 100 మంది వివరాలతో ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి 105 బిలియన్ (10,500 కోట్ల) డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో రూ.9.32 లక్షల కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ముకేశ్ అంబానీ ఆస్తి 12 శాతం తగ్గిందని ఫోర్బ్స్ తెలిపింది. కాగా, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 92 బిలియన్ డాలర్ల (9,200 కోట్ల డాలర్లు=రూ.8.17 లక్షల కోట్లు) సంపదతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. .

# శ్రీశైలం దేవస్థానానికి అంతర్జాతీయ ప్రమాణపత్రాలు



మనగళం శ్రీశైలం, : శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబా అమ్మవార్ల దేవస్థానం విశిష్టమైన గుర్తింపు సాధించింది. హెచ్‌వైఎమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ నుంచి దేవస్థానానికి %ఖూ% 9001 (క్వాలిటీ మేనేజ్‌మెంట్), 14001 (పర్యావరణ నిర్వహణ), 22000 (ఆహార భద్రతా నిర్వహణ) మరియు గుడ్ గవర్నెన్స్ సర్టిఫికేషన్ లభించాయి. ఈ సర్టిఫికెట్లను ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్స్ శాఖ మంత్రి అన్నం రామ నారాయణ రెడ్డి అందజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొలిసారిగా ఏదైనా ఆలయానికి గుడ్ గవర్నెన్స్ సర్టిఫికేట్ లభించడం విశేషం. భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయాలలో కనీస సౌకర్యాలు, భద్రత, నాణ్యత పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ నేపథ్యంలో స్వతంత్ర మూడోపక్ష సర్టిఫికేషన్ సంస్థల ద్వారా ఆలయాలు తమ ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తేచేందుకు మార్గదర్శకత్వం పొందడం ముఖ్యమని నిపుణులు అభిప్రాయపడ్డారు. శ్రీశైలం దేవస్థానం ఈ దిశగా ముందంజలో ఉంది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది శ్రద్ధతో నాణ్యత ప్రమాణాలు అమలు చేస్తూ, భక్తులకు మెరుగైన సేవలను అందిస్తున్నారు. సుస్థిరత, సమర్థత, సేవా ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ విజయంతో శ్రీశైల దేవస్థానం ఆధ్యాత్మికం, సేవ, నిర్వహణలో కొత్త ప్రమాణాలు నెలకొల్పినట్లు భావిస్తున్నారు.

# కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ సంతకాల సేకరణకు నడుంబిగిద్దాం పిలుపునిచ్చిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణకు పార్టీ శ్రేణులు నడుంబిగించాలని వైఎస్ఆర్‌సీపీ ఎస్ఈసీ సభ్యులు, మాజీ కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని మరియు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయలేక చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేట్‌పరం చేస్తూ వైద్యాన్ని పేదలకు దూరం చేసే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు నేటి నుంచి 45 రోజుల పాటు విస్తృత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి సంతకాలు సేకరించాలని సూచించారు. పౌరసమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న మేధావి వర్గాలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలను కలుపుకొని సంతకాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ అబ్జవర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి, గూడూరు జడ్పిటి మౌలాలి, రేమట సంపత్ కుమార్, గొల్లల దొడ్డి సర్పంచ్ లోకేష్, కర్నూలు మండల కన్వీనర్ మోహన్ బాబు, కోడుమూరు నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షులు ఎం కె వెంకటేష్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు గిరి ప్రసాద్, రైతు విభాగం అధ్యక్షులు నరసింహులు, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి మధు సూదన్, కర్నూలు మండల ఎస్ సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కర్నూలు మండల ఉప అధ్యక్షుడు గొందిపర్ల గోపాల్, కొండా రెడ్డి, సి బెలగల్ మండల ఆర్ టి ఐ విభాగం అధ్యక్షులు మహానంది, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ హామీలు ఏమైనట్లు ?




- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకరరెడ్డి

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా పర్యటన కు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల16న వస్తున్నట్లు కూటమి నేతలు ఊదర కొడుతున్నారని, పీఎం ఇచ్చిన హామీలు ఏమైనట్లు... ఇప్పటికైనా హామీల అమలకు పాలకులు పాటుపడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం కర్నూలు నగరం లోని ఇందిరాగాంధీ నగర్ లోని సుందరయ్య భవన్ లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి యస్ రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాల నరేంద్ర మోడీ పరిపాలనలో ఆంధ్ర రాష్ట్రానికి ఒరిగేందేమీలేదని విమర్శించారు. విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, వెనకబడ్డ ప్రాంతాలకు నిధులు కేటాయింపు ఊసే లేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపలేదు, రాయలసీమ హక్కుగా ఉన్న కడప ఉక్కు మాటే లేదన్నారు. అయితే పాలకులు మాత్రం పీఎం పర్యటనపై డప్పు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూల్లో ఏర్పాటు చేస్తామన్న హైకోర్టు పోయింది, బెంచ్ మాయమైందన్నారు. పేదలైన పసిపిల్లలు తాగే పాల డబ్బా నుండి కార్పొరేట్ కంపెనీల వరకు ఉసురు తీసే జీఎస్టీ ని వేసి, పీల్చిపిప్పి చేసి నేడు తగ్గించామంటూ తగుదునమ్మా అంటూ సభలు పెట్టడం ఎవరిని మోసం చేయడానికి ప్రశ్నించారు. ఇప్పటికైనా పీఎం పర్యటన సందర్భంగా కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కోసం మాట్లాడండి అని పాలకులకు హితువు పలికారు. ఇప్పటికే ఓర్వకల్ ప్రాంతంలో పది సంవత్సరాల క్రితం 30 వేల ఎకరాల భూమిని తీసుకున్నారని, ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజానీకానికి ఉపాధినిచ్చే పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశం లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి నిర్మల, యం డి ఆనంద్ బాబు, జి రామకృష్ణ, వెంకటేశ్వర్లు, టి రాముడు, ఎండి అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు రామాంజినేయులు, కే అరుణమ్మ, ఎన్ అలివేలమ్మ, హనుమంతు, వీరశేఖర్, లింగన్న, లక్ష్మన్న, నరసింహ, రాజశేఖర్, విజయ్, నగేష్, మోహన్, బాలకృష్ణ, నాగన్న, పెద్దకడుబూరు కార్యదర్శి తిక్కన్న, కోడుమూరు కార్యదర్శి రాజు, కల్లూరు కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీసీఎస్ లాభం రూ.12,075 కోట్లు

మనగళం, న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం టీసీఎస్ ప్రస్తుత ఆర్థి క సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ.12,075 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.11,909 కోట్లతో పోల్చితే లాభం 1.4న్ల పెరిగింది. బీఎఫఎసఐ సహా విభిన్న విభాగాల్లో ఏర్పడిన వృద్ధి లాభం పెరగడానికి దోహదపడిందని టీసీఎస్ వెల్లడించింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 2.39న్ల వృద్ధితో రూ.64,259 కోట్ల నుంచి రూ.65,799 కోట్లకు పెరిగింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 3.7న్ల పెరిగినా లాభం 5.3న్ల క్షీణించింది. మొత్తం కాంట్రాక్టు విలువ లేదా టీసీవీ (కాంట్రాక్టు కాలపరిమితిలో సంబంధిత కస్టమర్ నుంచి ఆశిస్తున్న ఆదాయం) రెండో త్రైమాసికంలో వెయ్యి కోట్ల డాలర్లున్నట్టు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమీర్ సెస్కారియా అన్నారు. ఈ త్రైమాసికంలో అన్ని విభాగాల్లోనూ మంచి వృద్ధిని తాము నమోదు చేసినట్టు సమీర్ చెప్పారు. మధ్యంతర డివిడెండ్: ఒక రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుపై 11 రూపాయల రెండవ మధ్యంతర డివిడెండును టీసీఎస్ ప్రకటించింది. నవంబరు 4వ తేదీన ఈ డివిడెండును చెల్లిస్తారు. డివిడెండు పొందేందుకు అక్టోబరు 15 రికార్డు తేదీగా నిర్ణయించారు. బీఎసఈలో గురువారం టీసీఎస్ షేరు 1.16న్ల లాభంతో రూ.3,061.95 వద్ద ముగిసింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఓటమి కాదు – నిర్ణయం మనల్ని గెలిపిస్తుంది
– దారి కష్టం అయినా పరవాలేదు మనలో ఉన్న అగ్ని చాలని
– ప్రపంచం గుర్తించకపోయినా పరవాలేదు
– మనం మనల్ని గుర్తించడం మొదలు పెడదాం
– అవకాశాల కోసం ఎదురుచూడొద్దు.. ఎదురొచ్చే కష్టాన్నే అవకాశం చేసుకో
– జీవితం అడిగేది అదృష్టం కాదు – ఒక్క అడుగు ముందుకు వేసే ధైర్యం

జీవితం అన్నది ఎప్పుడూ సూటిగా వెళ్లే రహదారి కాదు. కొన్ని మలుపులు మనం ఊహించని విధంగా ఉంటాయి. కొన్నిసార్లు మనం సిద్ధంగా లేకపోయినా ప్రయాణం కఠినంగా మారుతుంది. కష్టాలు వస్తాయన్న భయం మనల్ని వెనక్కి లాగుతుంది. కానీ ఒక నిజం మాత్రం మర్చిపోవద్దు ు మనల్ని ఓడించేది సమస్య కాదు, మన మనసులో పెరిగిన భయమే. ప్రతి మనిషి తన జీవితాన్ని మార్చే శక్తి తనలోనే ఉంచుకున్నాడు. కానీ ఆ శక్తి బయటకు రావాలంటే ఒక చిన్న అడుగు, ఒక సాహసమనోభావం, ఒక "నేను చేయగలను" అనే నమ్మకం చాలిస్తుంది. ఈ ప్రపంచంలో సాదారణంగా కనిపించే గొప్పవారు అందరూ మొదట్లో భయపడిన వారే. తేడా ఒక్కటే ు వారు భయంతో ఉన్నా అడుగు వేశారు, కానీ చాలామంది భయపడి మొదలే పెట్టలేదు.

మనసులో కల ఉండటం ఒకటి, ఆ కలను సాధించడానికి కదలటం వేరు. లక్షల మంది కలలు కనగలరు, కానీ కదిలేవారే చరిత్రలో నిలుస్తారు. ఇతరుల అభిప్రాయాల వల్ల, పరిస్థితుల ఒత్తిడి వల్ల, గత విఫలాల బాధ వల్ల మన పయనం ఆగిపోకూడదు. ఎందుకంటే జీవితం అంటే గెలుపు కోసమే కాదు, పోరాటం నేర్చుకోవడం కోసం కూడా. ఓటమి రుచి తెలియని మనిషి విజయపు విలువను ఎప్పుడూ అర్థం చేసుకోలేడు. ప్రతి సారి మనం పడిపోతే, అది అంతం కాదు ు అది మళ్లీ లేవడానికి వచ్చే అవకాశం. ఆ అవకాశం గుర్తించగలిగిన వాడే నిజంగా బలవంతుడు.

మనకు ఎన్ని సార్లు అవకాశాలు రాకపోయినా, ప్రపంచం మనల్ని గుర్తించకపోయినా, మనం మనల్ని వదిలేసే హక్కు మనకుండదు. ఎందుకంటే మన పై నమ్మకంతో మరొక చిన్న జీవితం మన చుట్టూ తిరుగుతూ ఉంటుంది ు అది కుటుంబమై ఉండొచ్చు, మన కలల రూపమై ఉండొచ్చు, మన కొద్దిపాటి ఆశల రూపమై ఉండొచ్చు. చాలామంది తమ జీవితాన్ని పోల్చుకోవడంలోనే కాలం గడిపేస్తారు. "అతనికి అదృష్టం ఉంది", "అయన పరిస్థితి వేరు", "నాకు అండగా ఎవరూ లేరు" ు ఇవన్నీ మన మనసులో పుట్టే సాకులు మాత్రమే. నిజం చెప్పాలి అంటే, విజయం అంటే వాతావరణం కాదు, నిర్ణయం. వాతావరణం అనుకూలం కాకపోయినా ముందుకు సాగినవాళ్ళే ఈ ప్రపంచాన్ని మార్చారు. మన మదిలో ఒకసారి అగ్ని రగిలితే, ఎదుట ఉన్న కొండ కూడా పర్వతం కాదు, కేవలం ఎక్కాల్సిన దారి మాత్రమే అయిపోతుంది.

కష్టాలు వచ్చినప్పుడు మనం ఎందుకు వెనక్కి తగ్గుతాం? ఎందుకంటే మనం వాటిని శత్రువుల్లా చూస్తాం. కానీ లోతుగా ఆలోచిస్తే కష్టం అనేది మనల్ని నిలిపి వేయడానికి కాకుండా, మనల్ని పరిక్షించి మరింత బలంగా మలచడానికి వచ్చిన ఒక అద్భుత శక్తి. వాగులో ప్రవహించే నీళ్లు ప్రశాంతంగా ఉన్నప్పుడే మనం అందంగా కనిపిస్తాయి ు కానీ అదే నీటిని ఎదురుగా ఒక పెద్ద రాయి ఆపితే ఆ నీరు శబ్దం చేస్తూ, బలం పెంచుకుంటూ, తన శక్తిని బయటకు తీశి ప్రవాహంగా మారిపోతుంది. మన జీవితాల్లో వచ్చే సమస్యలు కూడా అలాంటి రాళ్ళే. అవి మన ప్రవాహాన్ని ఆపడానికి కాదు, మనల్ని మరింత శక్తివంతంగా ముందుకు దూకించడానికి. మనం కష్టాన్ని శత్రువుగా చూస్తే అది బలంగా కనిపిస్తుంది. దానిని ఉపాధ్యాయుడిగా చూస్తే అది ఒక తీర్చిదిద్దే శక్తిగా మారుతుంది. మనకెప్పుడూ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, ఓటమి అన్నది మనలను మట్టి కరిపెట్టడానికి రాదు. అది వచ్చేది మన గుండెలో దాగి ఉన్న అసలు ధైర్యాన్ని బయటకు తీయడం కోసం. విజయవంతమైన ప్రతి మనిషి లోపల ఒక మూమెంట్ ఉంటుంది ు ఆ క్షణం వారే వారిని చూసి "ఇదెలా వచ్చినా నేను పోరాడతా" అని నిర్ణయించుకున్న సమయం. అదే నిర్ణయం అన్నింటిని మార్చుతుంది. మనం మారాలంటే ప్రపంచం మారాల్సిన అవసరం లేదు, మనలోని ఆ ఒక్క మాట ు "నేను సిద్ధం" ు చాలు. ఒకసారి మనలో ఆ నిర్ణయం మంటలా రగిలితే, మన ప్రయాణాన్ని ఎవరూ ఆపలేరు. ఎందుకంటే అప్పుడు మనం గెలుపుకోసం కాకుండా, మనసాక్షి కోసం నడుస్తుంటాం... ఆ ప్రయాణం ఎప్పటికీ పరాజయం చూడదు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ పట్టణంలో ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కి వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ,వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పి.ఎం సభను విజయవంతం చేద్దాం.

– ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి
(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్)



మన గళండోన్ ఈ నెల 16వ తేదీ భారత ప్రధాని నరేంద్ర మోదీ గారు ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో విచ్చేస్తున్నా సందర్భంగా బహిరంగ సభకు ఉమ్మడి కర్నూలు జిల్లా కూటమి నాయకులు, కార్యకర్తలు అందరం భారీ జన సమీకరణతో బహిరంగ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జీ.ఎస్టీ 2.0 సంస్కరణలు ప్రయోజనాలపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సి.ఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని. ఈ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు పాల్గొన్ననున్నారని అన్నారు. పి.ఎం సభకు బాధ్యత తీసుకోని కూటమి నాయకులు, కార్యకర్తలందరి కలసి విజయవంతం చేద్దామని అన్నారు.

## కోటి సంతకాల సేకరణకు శ్రీకారం



మన గళం వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలను విధానం నుంచి రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో కర్నూలులోని స్వగృహంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కంగాటి శ్రీదేవమ్మ గారు మరియు వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి గారు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, మండల కన్వీనర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్‌ఎంపీపీలు, సర్పంచులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, పత్తికొండ తాలూకా అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల కార్యవర్గ సభ్యులు, ఎంపీటీసీలు, వైస్సార్సీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని సభ కోసం పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ ఏర్పాట్ల పరిశీలన"







మన గళం : ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా సభా ప్రాంగణాన్ని పరిశీలించిన పత్తికొండ శాసన సభ్యులు శ్రీ కే.ఈ. శ్యామ్ కుమార్ అన్నగారు. ప్రధాన మంత్రి గారి సభ విజయవంతంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, అధికారులతో సూచనలు చేశారు.

## చెర్లకొత్తూరులో పోషణ మా కార్యక్రమం ఘనంగా - ఆరోగ్య అవగాహనతో జనాల్లో చైతన్యం






మన గళం : ఐసిడిఎస్ సిడిపిఓ లుక్ సార్ సూపర్వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది సిడిపిఓ లుక్ సార్ మాట్లాడుతూ ఉబ్బకాయం గురించి తెలియజేయడం అయింది దీనిలో భాగంగా ఉప్పు చక్కెర తగ్గించి సమపాలంలో తగినంత తీసుకోవాలని ఆయిల్ ఫుడ్ బయట ఫుడ్ తీసుకోకూడదని మన ఇంట్లో తయారు చేసుకున్నవి మాత్రమే తీసుకోవాలని ఆరోగ్య సమస్యలు మెరుగుపడతాయని తెలియజేయడమైనది. గర్భవతులు బాలింతలు తల్లులకు 1000 రోజుల కేరు గురించి తెలిపారు. సూపర్వైజర్ సరస్వతి మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆకుకూరలు కూరగాయలు పండ్లు చౌకో దొరికే అందుబాటులో ఉండే వాటిని తీసుకోవాలని తెలియజేయడం జరిగింది ,భేటీపడావొ బేటిబచావోలి గురించి %వీవీూ% స్కూల్ టీచర్ సుధాకర్ తెలియజేశారు బాలికలు రక్షిస్తాము చదివిస్తాం. బాలికల చదివే విద్యార్థి ఈ కార్యక్రమంలో ఆటల పోటీలు జరిపి బాలికలకు మొదటి రెండవ మూడవ బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్త వరలక్ష్మి పి మద్దమ్మ పి పద్మావతి బి మహేశ్వరి డి పద్మావతమ్మ నాగమద్దమ్మ హెల్పర్స్ స్రవంతి వెంకటేశ్వరమ్మ గ్రామ ప్రజలు తల్లిదండ్రులు పిల్లలు బాలింతలు మొదలగు వారు పాల్గొన్నారు

## రాయితీ శనగ విత్తనాల పంపిణీ



మనగళం, ఓర్వకల్లు : ఓర్వకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై శనగ విత్తనాల పంపిణీ"కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పాణ్య%శీ% ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి రైతుకలు శనగ విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, సింగిల్ విండో ప్రెసిడెంట్ లు సుధాకరయ్య, పాలకోలను సుధాకర్ రెడ్డి, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ జి నాగముని, మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, వ్యవసాయ అధికారిని మధుమతి తదితరులు పాల్గొన్నారు.

## పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. తగ్గిన బంగారం ధర..



మన గళం ఇటీవల బంగారం ధరకు రెక్కలొస్తున్నాయి. గోల్డ్ రేటు ఆకాశం వైపు దూసుకెళ్తుంది. సామాన్యులకు దొరకనంత ఎత్తుకు బంగారం ధర వెళ్తోంది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఇంకా చెప్పాలంటే బంగారం అంటేనే మహిళలు బయపడే రోజులు వచ్చాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. అయితే నేడు మాత్రం పసిడి ప్రియులకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఇటీవల దూసుకెళ్తున్న బంగారం ధరకు కాస్తా బ్రేకులు పడ్డాయి. వివిధ నగరాల్లో రూ.వెయ్యి మేర బంగారం తగ్గింది. ఇదే సమయంలో వెండి ధర దాదాపు మూడు వేలు పెరిగింది. ఇక నేటి బంగారం, వెండి ధరల ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం... శుక్రవారం (అక్టోబర్ 10న) హైదరాబాద్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,22,290 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,13,800 పలికింది. అలానే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,720 గా ఉంది. ఒక కేజీ వెండి ధర రూ. 1,80,000 పలికింది. బంగారం ధర నేడు భారీగా పెరిగింది. అలానే ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ.1, 22,440కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 12, 200 పలికింది. బంగారం ధరలు నిన్నటి తో పోల్చుకుంటే వెయ్యి రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్), విజయవాడలో రూ. 1, 24, 160, రూ. 1, 13, 810, ముంబైలో రూ. 1, 22, 290, రూ. 1, 12, 100, కోల్‌కతాలో రూ.1,22,290, రూ.1,12,100, చెన్నైలో రూ. 1,22,840, రూ.1,12,600, బెంగళూరులో రూ. 1,22,290, రూ. 1,12,100, కేరళలో రూ. 1,22,290, రూ. 1,12,100, ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి), విజయవాడలో రూ. 1,80,000, ఢిల్లీలో రూ. 1,70,000, చెన్నైలో రూ. 1, 70, 010, కోల్‌కతాలో రూ. 1,70,000, కేరళలో రూ. 1,80,000, ముంబైలో రూ. 1,70,000, బెంగళూరులో రూ. 1,70,000


## మౌలాలి స్వామి తిరునాళ్లలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

మనగళం, గోస్పాడు: నంద్యాల జిల్లా మండల కేంద్రమైన గోస్పాడులో శుక్రవారం ఘనంగా జరిగిన మౌలాలి స్వామి తిరునాళ్లలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు ద్వారం వీరారెడ్డి ఆహ్వానం మేరకు గోస్పాడు మౌలాలి స్వామి తిరునాళ్లలో ఎంపీ శబరి పాల్గొని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కొద్దిసేపు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు మంచిజరిగేలా నాయకులు ప్రయత్నించాలని సూచించారు. అర్హులైన వారికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీఠ వేస్తున్నారని, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు దీవించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.



## ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

మనగలం, నంద్యాల కలెక్టరేట్ : ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైల పుణ్యక్షేత్రానికి విచ్చేయనున్న నేపథ్యంలో, ఆయన పర్యటనను ప్రతిష్మాత్మకంగా, ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి సున్నిపెంటలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుండి ప్రధానమంత్రి పర్యటించే ప్రదేశాల వరకు రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, లైటింగ్, పార్కింగ్ వంటి అన్ని అంశాల్లో చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. పర్యటన సమయంలో గ్రీన్ రూమ్‌లో ప్రధానమంత్రి కార్యాలయంలో లభించే సదుపాయాలు సమానంగా ఉండేలా పంచాయతీరాజ్ ఇంజినీర్లు ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలకు నిపుణులైన వైద్యుల బృందాలను నియమించి, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉంచాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ అధికారులను ఆమె ఆదేశించారు. భ్రమరాంబ గెస్ట్ హౌస్, దేవస్థాన పరిధిలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ స్థలాలు, బారికేడింగ్, తాగునీటి సరఫరా, భద్రతా ఏర్పాట్లు, రవాణా సౌకర్యాల సమన్వయం వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని పూర్తి చేయాలన్నారు. ప్రతి శాఖ నోడల్ అధికారిని నియమించి, రోజువారీ పురోగతి నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

## ప్రధాని పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయండి

- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ నెల 16న కర్నూలులో పర్యటిస్తున్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నన్నూరు టోల్ గేట్ దగ్గర ఉన్న రాగమయూరి వద్ద పార్కింగ్, హెలిప్యాడ్, సభ ప్రాంగణం ఏర్పాట్లను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇంచార్జ్ జ్యోతి, డి సి ఎం ఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తదితరులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు. టాయిలెట్ ల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్డుపై ఉన్న డివైడర్ ల దగ్గర ప్లాంటేషన్ పనుల గురించి కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం పనులలో ఎక్కడ కూడా నిర్లక్ష్యం కనపడకూడదని కలెక్టర్ డీపీఓ ను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ముఖ్యంగా శుభ్రత, తాగునీటి సదుపాయాలు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సభ ప్రాంగణం వద్ద చేస్తున్న ఏర్పాట్ల గురించి కలెక్టర్ మాన్ సంస్థ ప్రతినిధులను ఆరా తీసి పలు సూచనలు ఇచ్చారు.

## పసుపుల గ్రామంలో తన స్వగృహం నందు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శుక్రవారం రోజు పసుపుల గ్రామంలో తమ స్వగృహంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కు నేరుగా తెలియజేశారు ప్రతి ఒక్కరి ఫిర్యాదును శ్రద్ధగా విని, వెంటనే సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో నిత్యం మమేకమై, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే గారు అన్నారు అలాగే కోడుమూరు నియోజకవర్గంలో ప్రజలందరికీ తమ సమస్యలను ఏమైనా ఉంటే నేరుగా వారికి తెలియపరచాలని ఆ సమస్యలన్నిటిని తప్పక పరిష్కరిస్తానని ఈ సందర్భంగా వారు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు



## నిషేధించిన యూట్యూబర్లకు రెండవ అవకాశం..

మన గళం: నిషేధించిన యూట్యూబ్ ఛానెల్‌కు రెండవ అవకాశం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రకటించింది. గతంలో నిషేధించిన సృష్టికర్తలు కొత్త ఛానెల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించే కొత్త ఫీచర్‌ను ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్ వెల్లడించింది. అయితే కాపీరైట్ ఉల్లంఘన, క్రియేటర్స్ బాధ్యత విధానాన్ని ఉల్లంఘించిన వారికి మాత్రం షరతులు వర్తిస్తాయని తెలిపింది. కంపెనీ పాత నియమాల ఫలితంగా సృష్టికర్తలకు జీవితకాల నిషేధం విధించడం జరిగింది. ఈ నియమాలను ఇప్పుడు మారుస్తున్నారు.తన బ్లాగులో, చాలా మంది తొలగించిన యూట్యూబర్లకు రెండవ అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఈ సృష్టికర్తలకు కొత్త అవకాశం ఇవ్వడంతో పాటు ప్లాట్‌ఫామ్‌లో వారి అభిప్రాయాలను వ్యక్తపరచడానికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపింది. కొత్త ఫీచర్ కింద, మహమ్మారి, ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు నిషేధించిన సృష్టికర్తలకు కొత్త ఛానెల్‌ను సృష్టించే అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపింది. అయితే, ఒక సంవత్సరం నిషేధం పూర్తి చేసిన ఛానెల్‌ల సృష్టికర్తలకు మాత్రమే కొత్త ఛానెల్‌ను సృష్టించే అవకాశం దక్కనుంది. అటువంటి సృష్టికర్తలకు రాబోయే రోజుల్లో %శీబుబఎవ% స్టూడియోలో కొత్త ఛానెల్‌ను సృష్టించే అవకాశం కనిపిస్తుంది. నిషేధించిన సృష్టికర్తలకు రెండవ అవకాశం ఇస్తోంది. కానీ కాపీరైట్ ఉల్లంఘన, క్రియేటర్స్ బాధ్యత విధానాన్ని ఉల్లంఘించిన కారణంగా నిషేధించిన ఛానెల్‌ల సృష్టికర్తలకు కొత్త నియమాలు ఉపశమనం కలిగించవు. ఇంకా, ఇప్పటికే తమ ఛానెల్‌లను తొలగించిన సృష్టికర్తలు కొత్త నిబంధనల నుండి ప్రయోజనం పొందరు. ఈ తాజా నిర్ణయం %+శీశీస్ట్రీవ%, ఇతర కంపెనీలు తమ నియమాలను సడలిస్తున్న ధోరణిలో భాగం. %జూఎ×ణ%-19 మహమ్మారి, 2020 %ఖూ% అధ్యక్ష ఎన్నికల సమయంలో పుకార్లు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ఈ కంపెనీలు తమ నియమాలను కఠినతరం చేశాయి.

YouTube

శనివారం
11 - 10 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అజాత..శత్రువు




అనునిత్యం తపించాడు. చిన్నమ్మవారి శాల కమిటి అధ్యక్షుడిగా ప్రతి నవరాత్రుల్లో దాదాపుగా4,5 వేల మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా నేత టి.జి.వెంకటేష్,సంఘ సభ్యుల సహాయ,సహకారాలతో చూడగలగడం..కేవలం తనకే చెల్లింది. దీంతో పాటు రైతు పక్షపాతిగా ఎద్దుల పందేలు నిర్వహిస్తూ రైతన్నల్లో జోష్ పెంచుతున్నారు..అంతే కాదు...తాను స్వతహాగా సేవాతత్పరుడైన నేపథ్యంలో పలు గుప్తదానాలు చేసిన,చేస్తోన్న నైజం తనది.

యువతకు..సందేశం : యువత వ్యసనాలను వీడి,పెద్దలను గౌరవిస్తూ,జీవితాన స్థిరత్వాన్ని సాధించాక,సమాజ సేవలో భాగస్వాములవ్వాలని తాను అంటుంటారు. మరీ ముఖ్యంగా యువత ఆధునిక పోకడలకు పోకుండా దేశానికి వెన్నుముకైన వ్యవసాయ రంగాన పెద్ద ఎత్తున కాలు మోపాలని సూచిస్తున్న తాను నిస్సందేహంగా యువతకు..ఓ..దిశా నిర్ధేశకుడే. మరో..మార్గదర్శే.

అన్నదాతల...పక్షపాతి : తనది స్వతహాగా వ్యవసాయ కుటుంబ నేపథ్యం కావడంతో రైతన్నల అవస్థలు, వారి సాధక,బాధకాలన్నవి తనకు స్వయంగా తెలుసు. ఆరుగాలం అలుపెరుగక శ్రమించినా తగిన ఫలితం లభించిక,దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడడం తగదన్నది తన భావన. క్షణికావేశాన బలవన్మరణాలకు పాల్పడితే..అయినవారిని అనాథలను చేసిన వారవుతారని, అలా కాకుండా తమ పంట పొలాలకు తగిన పంటలను ఎంచుకుని, సరైన విత్తనాలను విత్తుకుని, వ్యవసాయ అధికారుల సలహాలు,సూచనలు పాటిస్తూ, ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకోవాలని...రైతన్నలకు సూచిస్తున్న తాను..నిస్సందేహంగా అన్నదాతల పక్షపాతే.



భవిష్యత్..కార్యాచరణ : గతంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటిలో డైరెక్టర్ గా మూడు పర్యాయాలు పని చేసిన విశేష అనుభవం తనకుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు,రైతన్నలకు ఏం అవసరమనే విషయాల్లో తనకో స్పష్టమైన విజనుంది. ఈ సారి డైరెక్టర్ గా కాకుండా ఏకంగా వైస్ ఛైర్మెన్ అయిన క్రమంలో వంద శాతం సమస్యల పరిష్కారానికి శ్రమిస్తానని తాను హామీ ఇస్తున్నారు. అన్నదాతల పంటను నిల్వ ఉంచుకునేందుకు ఏ.సి.గోదాముల ఏర్పాటు,లైసెన్సులున్నా మార్కెట్ యార్డులో దుకాణాలు లేని వ్యాపారులకు దుకాణాల నిర్మాణం, తరచుగా విమర్శలకు గురవుతోన్న దళారుల సమస్య,రైతులకు రూ.10ల కే భోజనం అమలవుతున్నా..మరింత ఎక్కువ సంఖ్యలో అందించేలా చూడడం, కొత్తగా టాయిలెట్ల ఏర్పటు,యార్డులో అపారిశధ్య నిర్మూలకు ప్రాధాన్యమిస్తూ...గత కమిటి పాలనకు, ప్రస్తుత కమిటి పాలనకు మధ్య వ్యత్యాసమేంటో...చేతల్లో చూపుతానంటోన్న..తాను..నిజంగా....ఓ..సదాశయవాది.



నిరంతర..సేవకుడే : తాను అవసరార్థుల సేవలో నిరంతరం సంసిద్ధుడై ఉంటుంటాడు. తనను కర్నూలు నగరంలోని స్థానిక చిన్నమార్కెట్ లో ఉన్న తన కార్యాలయంలో గానీ, లేకపోతే కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో గానీ ఎవ్వరైనా నేరుగా ఉదయం,మధ్యాహ్న సమయాల్లో కలవవచ్చంటారాయన. అలా వీలు కాని పక్షంలో తన మొబైల్ నెంబర్ : 96666 36335 లో నైనా తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చంటోన్న తాను..ఓ..స్నేహశీలి.

జీవితాశయం : కర్నూలు మార్కెట్ యార్డ్ కు ఛైర్మెన్ కావడమే. అంటే..తన ఉద్దేశ్యం పదవి కాదు..తాను స్వయానా రైతు కావడంతో రైతన్నల సంక్షేమానికి అధిక అవకాశాలున్న మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ అయితే..తన ఆధ్వర్యంలో జిల్లా రైతన్నల శ్రేయస్సుకు శ్రమించే అవకాశం అంది వస్తుందన్న ఉదాత్త భావాలున్న.. సేవాతత్పరుడాయన.









# అజాత..శత్రువు



- ఉన్నత భూస్వామ్య కుటుంబాన జన్మించాడు
- దేనికీ లోటన్నదే లేని ఇంట పెరిగాడు
- చదివింది పదో తరగతే
- వ్యవసాయంపై ఉన్న మక్కువతో చదువుకు స్వస్తి పలికాడు
- వ్యవసాయ,వ్యాపార రంగాల్లో రాణించాడు
- నేత టి.జి.చెంతన చేరాడు
- ట్రేడ్ యూనియన్ నేతగ కార్మిక సమస్యల పరిష్కారానికి అహరహం శ్రమించాడు
- పనేదైనా..చేసే కార్యం పట్ల తనలోని చిత్తశుద్ధి, అంకితభావాలను ప్రదర్శించాడు
- తాను నమ్ముకున్న నేతలను మెప్పించగలిగాడు
- పదవులె(న్నె)న్నో..ఎదురొచ్చి స్వాగతించాయి
- ఆ పదవులకే వన్నె తెచ్చేలా వ్యవహరించాడు
- సమాజ సేవకు ప్రాధాన్యమిస్తోన్న ప్రజాహితైషి
- యువత వ్యవసాయం పట్ల మక్కువ చూపాలంటోన్న..మార్గదర్శి
- బలవన్మరణాలు తగవంటోన్న రైతు పక్షపాతి
- అవసరార్థుల సేవలో సదా సంసిద్ధుడిగా ఉంటోన్న...సేవాతత్పరుడు
- మార్కెట్ యార్డ్ ప్రగతే తన జీవితాశయమంటోన్న..రైతు బాంధవుడు

**...నిగర్వి,మితభాషి,కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మెన్ కమలాపురం శేషగిరి శెట్టి జీవిత విజయ ప్రస్థానమిది...**

(యస్.బి.నందకిషోర్,సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ నెంబర్ : 80087 88416)



**...రైతన్నల శ్రేయస్సే..లక్ష్యం..అన్నదాతల సంక్షేమమే..ధ్యేయం...
...మార్కెట్ యార్డ్ ప్రగతి కాంక్షాపరుడు..టిజివి కుటుంబానికి...వీర విధేయుడు...**



(మన గళం,కర్నూలు మార్కెట్ యార్డ్) : ""...వందలాది ఎకరాలున్న భూస్వామ్య కుటుంబం. దేనికీ లోటన్నదే లేని సంపన్నుల ఇంట చిట్టచివరివాడిగా పుట్టి,అల్లారుముద్దుగ పెరిగిన నేపథ్యం..ఇలాంటి పరిస్థితుల్లో జన్మించిన వారు, అలాంటి లగ్జరీలను అనుభవించిన,అనుభవిస్తున్న వారు తమకేం తక్కువనుకుంటూ..హాయిగా, ఆనందంగా జీవితాన్ని అనుభవించేందుకే..ప్రాధాన్యమివ్వడం...మనం చూస్తుంటాం. అయితే..తానలా అనుకోలేదు..తనకలాంటి అవకాశాలె(న్నె)న్నో ఉన్నా..తనకు వారసత్వంగా అంది వచ్చిన వ్యవసాయాన్ని నమ్ముకుని,వ్యాపార రంగాన రాణించి..ఉదాత్తుడైన ఓ నేత పంచన చేరాడు..ఆయన అండతో, తన వ్యవహారశైలితో సమోన్నతుడిగా ఎదిగాడు..."

"...ఖడక్ ఖద్దర్,చేతులకు పసిడి బ్రాస్లెట్లు,రింగులు,రెండు చేతులకు నాలుగు, నాలుగేసి ఉంగరాలు,కళ్లకు గోల్డ్ ఫ్రేం అద్దాలు..దాదాపుగా ఆరడుగుల ఎత్తున్న తన నడకలో హుందాతనం..వెరసి...ఎవ్వరో బిగ్ షాట్...అనుకుంటూ...పక్కకు తప్పుకు పోవడం ఎవ్వరికైనా అత్యంత సహజం..సర్వసాధారణం కూడానూ..ఆ ఆహార్యాన్ని చూసి, ఎవ్వరైనా అలా భావించడం సబబే. కానీ..తన దరికి వచ్చి మాట కలిపితే..నే..తెలుస్తుంది..తానెంతటి సాత్వికుడోనని..తనతో ఓ పది నిముషాల సమయాన్నైనా వెచ్చిస్తేనే ఎవ్వరికైనా తెలిసేది..తానెంతటి..ఉదాత్తుడోనని..తానెంతటి మితభాషోనని..తానే...కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మెన్ కమలాపురం శేషగిరి శెట్టి. తన జీవిత విజయ నేపథ్యంలోని పలు విశేషాల సమాహారం..మన గళం పాఠకులకు..ప్రత్యేకం..."

స్వగతం :

పూర్తి పేరు : కమలాపురం శేషగిరి శెట్టి

తల్లి,దండ్రులు : కె.నాగలక్ష్మమ్మ,కె.సుంకయ్య దంపతులు

స్వస్థలం : కె.నాగలాపురం గ్రామం,గూడూరు మండలం,కోడుమూరు నియోజకవర్గం,కర్నూలు జిల్లా

పుట్టిన తేదీ : 30.08.1958

కుటుంబ నేపథ్యం : వారిది సమోన్నత భూస్వామ్య కుటుంబం. నాగలాపురం,బూడిదపాడు,తదితర 4 గ్రామాల్లో దాదాపుగా 600ల ఎకరాల వ్యవసాయ భూములు వారి కుటుంబానికి ఉండేవి. తన తాత,నాన్నలు వ్యవసాయం చేసేవారు. అయితే ల్యాండ్ సీలింగ్ యాక్ట్ అమలవడం, తమ కుటుంబ అవసరాల నిమిత్తం కొన్ని పొలాలను అమ్మాల్సి వచ్చిన క్రమంలో ప్రస్తుతం తనకు కేవలం ఓ 32 ఎకరాల పొలం మాత్రమే ఉంది. అమ్మ కుటుంబ కార్యకలాపాల నిర్వర్తణలో తన తండ్రికి చేదోడు,వాదోడుగా ఉండేవారు. వారు వారి తల్లి,దండ్రులకు మొత్తం 9 మంది సంతానం. 6 మంది అన్నదమ్ములు,ముగ్గురు అక్క,చెల్లెళ్ల లో తాను అందరికన్నా ఆఖరివాడుగా జన్మించాడు.

కుటుంబం : ఆ దంపతులకు 47 ఏళ్ల కిందట వివాహమైంది. తన జీవిత సహధర్మచారిణి పేరు అరుణ. తాను కుటుంబ బాధ్యతల నిర్వర్తణలో తనకు తగిన రీతిన సహాయ,సహకారాలను అందజేస్తున్నారు. ఆ దంపతులకు ముగ్గురు సంతానం. వారి కుమారుడు సునీల్ కేబుల్ వ్యాపారంలో ఉండగా, వారి రెండో అబ్బాయి సుమన్ వెల్దుర్తిలో కిరాణా,బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. వారి చిన్న కూతరు పేరు సురేఖ, తాను సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా ఉన్నారు. మొత్తం సంతానానికి వివాహాలు జరిపించి, ఆయన తన బాధ్యతలను నిర్వర్తించారు.

విద్యాభ్యాసం : తాను పదో తరగతి దాకా కల్లూరు మండలం,పర్ల గ్రామంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివారు. ఆనక వ్యవసాయంపై ఉన్న మక్కువతో చదువుకు పదో తరగతితోనే స్వస్తి పలికారు.

రుచి-అభిరుచి : తాను పక్కా శాఖాహారి. మాంసాహారమన్నది ముట్టనే ముట్టరు. కనీసం కోడి గుడ్డయినా తనకు పడదు. కేవలం సాత్వికాహారాన్నితీసుకునేందుకే ప్రాధాన్యమిస్తారు. కూరగాయలు,పండ్లు తన మెనూలో ఉంటాయి. ఇక అభిరుచులంటే..వ్యవసాయం,యోగా,ఆర్యవైశ్య సంఘ ప్రగతికి తన వంతు బాధ్యతలు నిర్వర్తిండమే.



బాధ-ఆనందం: మంచం ఉన్న కాడికి కాళ్లు చాపుకునే తత్వం తనది. ఈ క్రమంలో తనకు బాధ పడే అగత్యమే రాలేదు. ఇక ఆనందించిన సందర్భాలంటే మూడు పర్యాయాలు డైరెక్టర్ గా పని చేసిన తనకు మరోసారి ఏకంగా మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ గా అవకాశం లభించడమే.

సినిమాలు : చూసేది చాలా తక్కువ. ఏడాదికోసారి అదీ సైతం తన వివాహ వార్షికోత్సవం రోజున కుటుంబ సభ్యులతో కలిసి, ఏదైనా వినోదాత్మక చిత్రాన్ని వీక్షించేందుకు వెళ్తుంటారు.

న(మె)చ్చిన..నటులు : తాను 20 ఏళ్ల పాటు సినీ నటుడు దగ్గుపాటి వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాను వెంకటేష్ కు వీరాభిమానిగా ఉండేవారు.

న(మె)చ్చిన..నేతలు : రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్, రాష్ట్ర మంత్రివర్యులు టి.జి.భరత్ లే.

స్ఫూర్తి-ఆదర్శం : ఇంకెవ్వరు..? రాష్ట్ర మంత్రి టి.జి.భరతే తనకు స్ఫూర్తి ప్రదాత, ఆయనే తనకు ఆదర్శం.

బెస్ట్ ఫ్రెండ్స్ : తాను అందరితోనూ కలుపుగోలుగా ఉంటారు. అయితే..పెరుమాళ్ల మురళి,హరిబాబు,శాంతి,సురేష్,మంజులు తనకు అత్యంత హితులు,సన్నిహితులు.

రాణించిన..వ్యాపారి : తాను గత 35 ఏళ్ల కిందట స్వగ్రామమైన కె.నాగలాపురం గ్రామం నుంచి కర్నూలు నగరానికి వచ్చారు. నగరంలో ఓ జిరాక్స్ షాపును ఆయన నిర్వహించారు. ఆనక..వీలు పడక..అది తీసేశారు.



పదవులె(న్నె)న్నో : తనలోని నిబద్ధత,అంకితభావం,చిత్తశుద్ధి తనకు పదవులనెన్నింటినో తెచ్చి పెట్టాయి. తాను ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా తాను 20 ఏళ్ల పాటు ఏకధాటిగా పని చేశారు. ఆనక,రాష్ట్ర సహ కార్యదర్శిగా, జిల్లా సంఘంలో ఉపాధ్యక్షుడిగా, పొట్టి శ్రీరాములు కమిటిలో జిల్లా అధ్యక్షుడిగా,నందవరం నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడిగా, అలంపూర్ ఆర్య వైశ్య సంఘం నిత్యాన్నదాన సత్రం డైరెక్టర్ గా,టిజివి ట్రేడ్ యూనియన్ నేతగా,రాయలసీమ హక్కుల ఐక్యవేదిక కడప జిల్లా ఇంఛార్జ్ గా పని చేశారు. ప్రస్తుతం కర్నూలు నగరపాలక సంస్థ 9వ వార్డు తెదేపా ఇంఛార్జ్గా, చిన్నమ్మవారి శాల కమిటి అధ్యక్షుడిగా,వాసవీ దీక్షఅమలుకు పర్యవేక్షకుడిగా ఉంటున్నారు.

సేవకు...ప్రతిఫలమే : తాను నేత టి.జి.వెంకటేష్ హయాంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు మూడు పర్యాయాలు డెరెక్టర్ గా విధులు నిర్వర్తించారు. అప్పట్లో తాను రైతు సమస్యల పరిష్కారానికి పని చేసిన పని తీరు తనకు మరోసారి మంత్రి టి.జి.భరత్ హయాంలో మరోసారి..అంటే నాల్గవ సారి ఏకంగా అదే మార్కెట్ యార్డుకు ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యే అవకాశాన్ని తెచ్చి పెట్టింది.

సేవా..తత్పరుడే : తాను ఏ పదవిని అలంకరించినా..ఆ పదవికే వన్నె తెచ్చేలా తన వ్యవహార శైలి సాగింది. టిజివి ట్రేడ్ యూనియన్ లో కార్మికుల సమస్యల పరిష్కారానికి తాను అలుపెరుగని పోరాటాలు చేశారు. ఆర్యవైశ్య సంఘాన సంఘ సభ్యుల చేయూతకు

7లో






Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310